క్లుప్తంగా

స్వప్నకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకురాలు చల్లా స్వప్నకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆసరా స్కీం ఎ డిటైల్డ్ స్టడీ అబౌట్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఆసరా స్కీం అండర్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి చల్లా స్వప్నకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ రామచంద్రం పర్యవేక్షణలో స్వప్న తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఫార్మసీలో ఫలక్నాజ్‌కు డాక్టరేట్



వరంగల్: హైదరాబాద్ చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ ఫార్మసీ విభాగం పరిశోధకురాలు, నగరానికి చెందిన ఫలక్నాజ్ డాక్టరేట్ సాధించారు. ఈమేరకు సీడీసీ డైరెక్టర్ సాత్విక రెడ్డి, వైస్ చాన్స్‌లర్ జి.దామోదర్, పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్, డీన్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ క్రిష్టోఫర్, సీడీసీ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ శంకరయ్యల చేతుల మీదుగా శనివారం డాక్టరేట్ అందుకున్నారు. 'రోల్ ఆఫ్ బయో మార్కర్స్ ఇన్ ప్రిడియాక్టింగ్ డయాబెటీస్ కంప్లికేషన్స్' అనే అంశంపై సీడీసీ కళాశాల ఫార్మసీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ప్రావీణ పర్యవేక్షణలో ఫలక్నాజ్ సమర్పించిన పరిశోధన గ్రంథానికి చైతన్య యూనివర్సిటీ డాక్టరేట్‌పట్టా అందజేసింది.

ఆహ్వాన పత్రిక అందజేత

కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఈనెల 30 నుంచి జరగనున్న 27వ వసంతోత్సవ ఆహ్వాన పత్రికను తొగుట పీఠాధిపతి మాధవానంద స్వామి సరస్వతికి ఆదివారం అందజేశారు. స్వామి వారిని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు కలిసి ఆలయంలో జరగనున్న ఉత్సవాలు, జరుగుతున్న ఏర్పాట్లను వివరించారు. కార్యక్రమంలో అయినవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ పాల్గొన్నారు.

తాగునీటి పంపిణీ

కాజీపేట రూరల్: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అర్బన్ జిల్లా మాజీ కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాజీపేట బాపూజీనగర్‌లో ఆదివారం తాగునీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నార్లగిరి రమేష్, దువ్వ కనకరాజ్, శిరుమల్ల దశరథం, ఎండీ.అఫ్జల్, ఇమ్మడి రవి, కోండ్ర శంకర్, కరుణ్, గాజుల విజయ్, రామగిరి రాంచందర్, సిరిపాక కుమార్, హుస్సేన్ పాల్గొన్నారు.

పర్సు పోగొట్టుకున్న భక్తురాలు

హన్మకొండ కల్చరల్: అమ్మవారి దర్శనానికి హైదరాబాద్ నుంచి ఆదివారం వచ్చిన ఒక భక్తురాలి రూ.4 వేల నగదు, 13 గ్రాముల బంగారం ఉన్న పర్సు పోగొట్టుకుంది. ఈ మేరకు దేవాలయం ఈఓ శేషుభారతి తెలిపిన వివరాల ప్రకారం భక్తురాలు తన భర్త, మూడేళ్ల పాపతో కలిసి ఉదయం అమ్మవారిని దర్శించుకుని దేవాలయం లోపల ఉన్న భద్రేశ్వరస్వామి దేవాలయం వెనుక సేదదీరుతున్నారు. భక్తురాలి పాప తాగునీరు అడగడంతో బయటకు వెళ్లింది. అనంతరం కూర్చున్న ప్రదేశంలో ఉంచిన పర్సు కనిపించ లేదు. దీంతో దేవాలయంలోని స్వీపర్లు, సిబ్బందిని విచారించగా, వారు చూడలేదని తెలపడంతో మట్టెవాడ పోలీసులకు సమాచారం అందించానని ఆమె తెలిపారు. సీసీటీవీ ఫుటేజీను పరిశీలించడానికి సోమవారం సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తామని శేషుభారతి తెలిపారు.


వృద్ధురాలి అదృశ్యం

ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి ఎస్‌ఆర్‌ఆర్‌తోటకు చెందిన 65 ఏళ్ల వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. వరంగల్ ఎస్‌ఆర్‌ఆర్‌తోటకు చెందిన రాదారపు కేతమ్మ (65) ఒంటరిగా ఉంటోంది. ఈనెల 24న ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్న విషయం కుమార్తె టేకుమట్ల కొమురమ్మకు తెలిసింది. ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఈ మేరకు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో కొమురమ్మ ఫిర్యాదు ఆదివారం చేయగా.. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 28న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ప్రశాంత్ నగర్ ప్రాంతంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీ కమిటీ అధ్యక్షుడిగా నాగరాజు



హన్మకొండ: హనుమకొండ హౌసింగ్ బోర్డు కాలనీ కమిటీ అధ్యక్షుడిగా కొండా నాగరాజు విజయం సాధించారు. అధ్యక్ష పదవికి ఇరువురు ముఖాముఖి పోటీపడగా ఆదివారం పోలింగ్ నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి గంగుల వినోద, కోశాధికారిగా బేతెల్లి రవి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వైకుంఠం తెలిపారు.

సమస్యల్లో వినాయక నగర్

- రోడ్లు, డ్రెయినేజీలు అస్తవ్యస్తం
- ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



వినాయక నగర్‌లో మట్టిరోడ్డు



ఖాళీ స్థలంలో నిలిచిన మురుగునీరు

ఖిలా వరంగల్: వరంగల్ 43వ డివిజన్ పరిధి వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్‌బంక్ వినాయక నగర్‌లో సమస్యలు తిష్టవేశాయి. నగరపాలక సంస్థలో విలీనమైన తరువాత ఇక్కడి సమస్యలను పట్టించుకునే వారు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కాలనీలో అధ్వానంగా సీసీ రోడ్లు, అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ ఉంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం కోసం రూ.60 లక్షలు కేటాయించి, అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేష్ శిలాఫలకాన్ని ఆవిష్కరించి వదిలేశారు.

ప్రజలకు తిప్పలు

వేసవి కాలంలో వినాయకనగర్ కాలనీ -4లో పైపులైన్ లేక తాగునీటి కోసం స్థానికులు తల్లడిల్లుతున్నారు. పైపులైన్లు ఉన్న కాలనీలో రెండు రోజులకు ఒక్కసారి అరకొరగా నీటి సరఫరా అవుతోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకొకసారైనా అస్తవ్యస్తంగా ఉన్న మురుగు కాల్వలను బల్దియా పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంటోంది. పలుకాలనీల్లో జనావాసాలు, ఖాళీ స్థలాల్లోకి మురుగునీరు పారుతోంది. దాంతో దోమలు వృద్ధి చెందడంతో స్థానికులు విషజ్వరాల బారిన పడుతున్నారు.





వినాయకనగర్‌లో అంతర్గత రోడ్లపై పారుతున్న మురుగునీరు



జనావాసాల్లో ఏపుగా పెరిగిన ముళ్లకంప

సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి



కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వేసవిలో దుమ్మూధూళి, వర్షాకాలంలో బురదతో అవస్థలు పడుతున్నాం. అధ్వానంగా మారిన రోడ్లతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం. ఇళ్ల మధ్య, ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరడంతో దుర్వాసన వస్తోంది.

– పోలుసాని సుభాష్‌రావు, అధ్యక్షుడు, వినాయక నగర్

వేసవిలో తాగునీటి ఇబ్బంది తీర్చాలి



వేసవిలో తాగునీటి కోసం తల్లడిల్లుతున్నాం. పైపులైన్ల ద్వారా తాగునీరు సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నాం. కచ్చా డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, మురుగునీళ్లు నిలిచి రోడ్లపై పారుతోంది. దీంతో దోమలు, ఈగలు స్వైరవిహారం చేయడంతో విషజ్వరాల బారిన పడుతున్నాం.

– పెద్ది సుధ, స్థానికురాలు

సమస్యల పరిష్కారానికి కృషి



వరంగల్ 43వ డివిజన్‌లో సమస్యలు ఉన్నప్పటికీ సుమారు రూ.40 కోట్ల నిధులతో పార్కులు, శ్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి పైపులైన్ల నిర్మాణాలు చేపట్టాం. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సహకారంతో సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధికి పాటుపడుతున్నాం. వేసవి కాలంలో పైపులైన్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా కూడా పలు కాలనీలకు నీటిని అందజేస్తున్నాం. త్వరలోనే వినాయక నగర్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి కృషి చేస్తాం.

– అరుణవిక్టరీ, కార్పొరేటర్, 43వ డివిజన్

పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తూ నిరసన తెలుపుతూ..

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కాకతీయ యూనివర్సిటీలోని పార్ట్‌టైం అధ్యాపకుల అసోసియేషన్ బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ దూరవిద్య కేంద్రం ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ యూనివర్సిటీల్లో పార్ట్‌టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా హామీని వెంటనే నెరవేర్చాలని కోరారు. 12 యూనివర్సిటీల్లోని 927మంది పార్ట్‌టైం అధ్యాపకులకు మినిమం టైంస్కేల్ ఇవ్వాలని సూచించారు. అనంతరం, దూరవిద్య కేంద్రం ఆవరణలోని మహాత్మాజ్యోతిబా పూలే దంపతుల విగ్రహాలు, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ తిరుణహరి శేషు, విజయ్‌కుమార్, భిక్షపతి, బాలకృష్ణ, శ్రీధర్, రాజేందర్, కుమార్, నాగరాజు, దాసు, ఫణీంద్ర, సురేష్, సదానందం, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర బధిరుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

హన్మకొండ కల్చరల్: హనుమకొండ ఎస్‌బీటీ ప్రగతినగర్ కాలనీఫేస్ -2లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ జె.లక్ష్మీనర్సమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 28 నుంచి జూన్ 21 వరకు దరఖాస్తులు చేసుకోవాలని, ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశం పొందిన వారికి ఉచితంగా హాస్టల్ వసతి, ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉచితంగా బోధన ఉంటుందని తెలిపారు. తప్పనిసరిగా వికలాంగుల సదరం గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, యూడీఐడీ కార్డు, కులం, ఆదాయం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, నాలుగు పాస్‌ఫొటోలు పాఠశాల కార్యాలయంలో అందజేయాలని వివరించారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె



సమ్మె చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: రెగ్యులరైజ్ చేయాలని కేయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూలోని పరిపాలన భవనం వద్ద ఆదివారం సమ్మెను కొనసాగించారు. సమ్మె శిబిరంలో కేయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ బాధ్యులు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, డాక్టర్ సాదు రాజేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వీసీలు బాధ్యతగా తీసుకొని ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సమ్మెలో జేఏసీ బాధ్యులు సతీష్, జూల సత్య, సూర్యనారాయణ, చంద్రశేఖర్, రఘువర్ధన్ రెడ్డి, సునీత, భాగ్య, సుకన్య, ఉషాకిరణ్, శ్రీలత, సత్యనారాయణ, విద్యాసాగర్, బ్రహ్మం, రంజిత, మధుకర్‌రావు, శ్రీనివాస్, శ్రీదేవి, అరూరి సూర్యం, రమేష్, లక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఫ్లాగ్‌మార్చ్



ఆర్పీఎఫ్ ఫ్లాగ్ మార్చ్‌లో సీఐ చటర్జీ, పోలీసులు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు ఆదివారం ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. సికింద్రాబాద్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మిత బెనర్జీ ఆదేశానుసారం ప్రయాణికులకు రైలు ప్రయాణంలో, రైల్వే స్టేషన్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అండగా ఉంటూ భద్రత కల్పిస్తుందని అవగాహన కల్పించినట్లు కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ చటర్జీ తెలిపారు. కాజీపేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలు, రైల్వే స్టేషన్ ముందు ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

సభకు తరలివెళ్లిన బీఆర్‌ఎస్ శ్రేణులు



మడికొండ: జెండాను ఎగురవేస్తున్న కార్పొరేటర్

వరంగల్: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిని బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వరంగల్‌లోని పలు డివిజన్ల నుంచి నాయకులు, కార్యకర్తలు ఆదివారం బయలుదేరి వెళ్లారు. 3వ డివిజన్‌లో పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణ ఆధ్వర్యంలో గ్రామ పార్టీ అధ్యక్షులు పండుగ రవీందర్‌రెడ్డి, కుమార్ యాదవ్, స్వామి దాస్ (డైరెక్టర్), బొల్లం విజయ్, నామసాని నాగరాజ్, చిలుక చిన్ని, ప్రభాకర్, సారంగం, 18, 19వ డివిజన్లలో చిలువేరి పవన్ ఆధ్వర్యంలో పలువురు వాహనాల్లో తరలివెళ్లారు.

64వ డివిజన్ నుంచి..

మడికొండ: భారతీయ రాష్ట్ర సమితి రజతోత్సవ సభకు గ్రేటర్ వరంగల్ పరిధిలోని 64వ డివిజన్ మడికొండ, టేకులగూడెం గ్రామాల నుంచి పలువురు కార్యకర్తలు.. కార్పొరేటర్ ఆవాల రాధిక రెడ్డి ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీగా సభ ప్రాంగణానికి బయలుదేరారు. కార్యక్రమంలో నాయకులు భూక్య సోంరావు, బొల్లికొండ రవీందర్, వస్కుల దేవేందర్, గంగారపు వీరేష్, అరూరి రమేష్, లడ్డు కుమార్, రమేష్ పాల్గొన్నారు.

వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం నుంచి..

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంత నుంచి బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఆ పార్టీ నాయకులు ఆదివారం తరలివెళ్లారు. వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో పలు డివిజన్ల నుంచి నాయకులు, కార్యకర్తలు బయల్దేరారు. ఈ సందర్భంగా వాహనాలను నరేందర్ జెండా ఊపి ప్రారంభించారు.

మామునూరు నుంచి..

మామునూరు: ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు బొల్లికుంటకు చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. మండల పీఏసీఎస్ సొసైటీ వైస్ చైర్మన్ సోల్తీ భూమాత ఆధ్వర్యంలో వాహనాల్లో సభకు వెళ్లారు.

సభకు తరలిన మచిలీబజార్

హన్మకొండ చౌరస్తా: బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు పార్టీ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో మచిలీబజార్ ప్రజలు తరలివెళ్లారు. సభకు తరలిన వారిలో ఉడుతుల సారంగపాణి, బయ్య శోభన్, రఘు, హరికృష్ణ, రామకృష్ణ, స్రవంతి, హరిణి, సందీప్ తదితరులు ఉన్నారు.

పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోమశేఖర్

విద్యారణ్యపురి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని హంటర్ రోడ్డులో అవోపా భవన్‌లో ఆదివారం నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ ఉద్యమ తరగతుల్లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని, ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని, ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయ ఉద్యమ చరిత్ర గురించి వివరించారు. టీఎస్‌యూటీఎఫ్ మరో రాష్ట్ర కార్యదర్శి రంజిత్.. లీవ్ రూల్స్, సర్వీస్ రూల్స్ గురించి వివరించారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు సీహెచ్.రవీందర్‌రాజు, తాటికాయల కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెండెం రాజు, సుజన్ ప్రసాద్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు రాజారాం, మేకరి దామోదర్, జ్యోతి, అన్నాదేవి, పద్మలత, బాధ్యులు సీహెచ్.లింగారావు, సీఎస్‌ఆర్.మల్లిక్, చంద్రయ్య, రమేష్, కరుణాకర్, పాక శ్రీనివాస్, నామోజు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల దీక్షా దినం మేడే



మాట్లాడుతున్న వీఎస్.రావు

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్.రావు

కేయూ క్యాంపస్: కార్మికుల హక్కుల దీక్షా దినం మేడే అని, కార్మికవర్గ ప్రతిఘటన వల్లనే ఆనాడు 8 పనిగంటల పనిదినాలను చట్టం చేశారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్.రావు అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ సెమినార్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సీఐటీయూ రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నయా ఉదారవాద విధానాలను ప్రతిఘటించాలని సూచించారు. కార్మికులను కట్టుబానిసలుగా చేసేవిధంగా కార్మిక కోడ్‌లు రూపొందించబడినట్లు తెలిపారు. దీనికి వ్యతిరేకంగా మేడే పోరాట స్ఫూర్తితో ఉద్యోగులు, కార్మికులు ఉద్యమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రం అనుసరిస్తున్న నయా ఉదార విధానాలను ప్రతిఘటిస్తూ, కార్మికులను ఐక్యం చేస్తూ మేడేను జరుపుకోవాలని సూచించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, జిల్లా నాయకులు మెట్టు రవి, బొట్ల చక్రపాణి, రాంచందర్, పుల్లా అశోక్, రవి, రజిత, రాజేశ్వరి, కల్పన, పల్లె రామన్న, యాకయ్య, సంపత్, కార్మికులు పాల్గొన్నారు.

కాషాయ జెండా ఎగరడం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

ఖిలా వరంగల్: రానున్న రోజుల్లో తూర్పు నియోజకవర్గంపై కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్, మండల అధ్యక్షుడు బోరిగం నాగరాజు ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ కరీమాబాద్‌లో ఆదివారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. బూత్‌స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలని, అందుకు ప్రతీ కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని సూచించారు. మండల కమిటీని పటిష్టంగా నిర్మించుకున్నామని, స్థానిక సమస్యలపై పార్టీ శ్రేణులు వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరటం ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు మంద శ్రీను, కర్నె రవీందర్, బైరి నాగరాజు, మాదాసు రాజు, కపిల్, రాజేందర్, దీన్‌దయాళ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహన పెంపొందించుకోవాలి



ఎగ్జిబిషన్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

వరంగల్: సాంకేతిక పరిజ్ఞాన పురోగతిపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ప్లాటినం జూబ్లీ హైస్కూల్ ప్రిన్సిపాల్ జగదీష్ పేచే సూచించారు. వరంగల్ అబ్బనికుంటలోని ప్లాటినం జూబ్లీ హైస్కూల్‌లో మూవింగ్ మార్వెల్స్ (ఎగ్జిబిషన్) కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలికితీసేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోలార్ ప్లాంట్, వాహనాలు అభివృద్ధి చెందిన తీరును విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో టీచర్లు విద్య, సరస్వతి, రాధిక, విద్యార్థులు రుతిక, అభిరామ్, సుప్రీత, విఘ్నేష్, విక్రాంత్, తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు ఘన నివాళి



హనుమకొండలో సీఎస్‌ఐ చర్చి వద్ద నివాళులర్పిస్తున్న చర్చి పాస్టర్, సభ్యులు



వరంగల్: పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న లక్ష్మీపురం మార్కెట్ వ్యాపారులు, తదితరులు

విద్యారణ్యపురి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడుల్లో మరణించిన పర్యాటకులకు హనుమకొండలోని సీఎస్‌ఐ చర్చి సభ్యులు ఆదివారం అశ్రు నివాళులర్పించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ రెవ ఆర్.సుప్రియ దర్శిని సర్వేశ్ మాట్లాడుతూ దేశంలో భిన్నత్వంలో ఏకత్వం తమ ఐక్యతకు మూలం అని అన్నారు. చర్చి కార్యదర్శి డాక్టర్ శ్యామూల్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ హింసను ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు. చర్చి సభ్యులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏసురత్నం, రిబ్కాజాన్, ఉషామార్త, డివిడ్సన్, సుమిత్రపాల్, రిబ్కా సంజీవరావు, దేవిస్మరస్, విజితప్రియ, సుహాసిని, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురం మార్కెట్‌లో..

వరంగల్: జమ్మూకశ్మీర్ పహల్గాం ఉగ్రముఖ దాడిలో అసువులు బాసిన మృతులకు సంతాపం ప్రకటిస్తూ వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లోని కమిషన్, హోల్‌సేల్ వ్యాపారులు బేతి అశోక్ బాబు ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి, ర్యాలీ నిర్వహించి, కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ పహల్గాంలో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడి ఘటన దేశ ప్రజలను కలిచివేసిందని అన్నారు. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాకిస్తాన్‌కు ప్రభుత్వం గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, వ్యాపారులు జారతి శ్రీనివాస్, బూరుగుపల్లి శ్రీనివాస్, పాటల రవి, భద్రయ్య, నేపాల్ రాజు, కక్ర వెంకటేశ్వర్లు, శీలం శ్రీనివాస్, కాసర్ల రాజు, నాగేశ్వర్‌రావు, హమాలీలు, రైతులు పాల్గొన్నారు.



కాజీపేట పట్టణంలో నిరసన తెలుపుతున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

వాకర్స్ సభ్యుల నిరసన

కాజీపేట: పహల్గాం మృతుల ఆత్మశాంతికి కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ చౌరస్తాలో వడ్డేపల్లి ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లెపల్లి రాజేష్ ఆధ్వర్యంలో సభ్యులు కొవ్వొత్తులతో పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి తీవ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆరెల్లి శ్రీనివాస్, జి.రవీందర్ రెడ్డి, సంజీవరెడ్డి, కోండ్ర శంకర్, మెజీషియన్ శ్రీనివాస్ రెడ్డి, బావు రవీంద్రకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

ఖిలా వరంగల్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక పర్యాటకులపై దాడి చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. యాత్రికులను కాల్చి చంపడం హేయమైన చర్య అని, ఈ దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలని సూచించారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరుగాంచిన పహల్గాం ప్రాంతాన్ని నిత్యం వేలాది మంది పర్యాటకులు సందర్శిస్తారని పేర్కొన్నారు. ఉగ్రదాడి వల్ల పర్యాటకులు, స్థానికుల మనోధైర్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఖిలా వరంగల్: మధ్యకోట న్యూ బ్లూబర్డ్స్ హైస్కూల్ ప్రాంగణంలో ఆ పాఠశాల 2003 – 2004వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 20ఏళ్ల తర్వాత ఒకే వేదికపై వారంతా కలిసి ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాటి మధుర అనుభూతులను గుర్తు చేసుకున్నారు. నాటి గురువులకు పూర్వ విద్యార్థులు సన్మానించారు.